# నిజమైన సంస్కారం

★

రచన: శ్రీ ఎ. ఎం. అయోధ్యా రెడ్డి.

(గత సంచిక తరువాయి)

ఫ్రెండ్స్‌కు గుడ్ బై చెప్పి బస్సులోకి తిరిగిన పేపరుమార్కు ఎర్రచొక్కా హిప్పీ అబ్బాయి సిగరెట్ ఒకటి తీసి విలాసంగా వెల్గించాడు.

రింగు రింగులుగా పొగవొదుల్తూ తన వేపు మిర్రి మిర్రి చూస్తున్న అందరి మొహాన ఓ చిరునవ్వు పారేసాడు.

సీట్లోంచి లేపబడి రాడ్ పట్టుకు వ్రేళాడుతున్న ఆసామికి వొళ్ళు మండిపోయింది. గుడ్లు మిటకరిస్తూ కసిగా చూశాడు.

మిగతా ప్రయాణీకులంతా ఆ అబ్బాయి అలా నిర్లక్ష్యంగా నవ్వటం సహించలేక పోయారు. పైకి ఏమీ అనలేక మనసులోనే అతణ్ణి తిట్టిపోస్తూ ఈర్ష్యగా చూస్తున్నారు. స్పీడుగా పోతున్న బస్సు కండక్టర్ బెల్ కొట్టటంతో ఒక స్టేజిలో ఆగింది. బస్సులోకి డబ్భై యేళ్ళ వృద్ధుడు ఎక్కాడు.

అతను చాలా బలహీనంగా వున్నాడు. చిన్నతోపుకుక్కూడా తూలిపోతున్నాడు. రాడ్ పట్టుకొన్న అతని చేతుల్లో ఏమాత్రం శక్తి వున్నట్లు లేదు.

బస్సు తిరిగి బయల్దేరింది. నిలబడి వున్న ప్రయాణీకులు బస్సుకుదుపులకు సడెన్ బ్రేకులకూ అటూఇటూ వూగి పోతున్నారు.

ఆసమయంలో వృద్ధుని అవస్థ వర్ణనాతీతంగా వుంది. పూర్తిగా తూలిపోయి సీట్లలో కూర్చునివున్న వారిమీద పడిపోయాడు రెండుసార్లు. పాపం అతని స్థితి గమనించకుండా వాళ్లు తిట్లూ శాపనార్థాలూ పెడుతున్నారు.

ఆ వృద్ధుని చూస్తే అందరికీ జాలేసింది. ఈజాలి అనేది సీట్లలో కూర్చున్న వారికి యింకొంచెం ఎక్కువే వేసింది. అయితే వాళ్ళు కేవలం సానుభూతి చూపించారు తప్పితే— ఎవ్వరూ కొద్ది చోటుకూడ ఇచ్చే ప్రయత్నం చేయలేదు.

కండక్టర్‌కి కూడా జాలి కల్గింది— "ఓయ్ తాతా! పడిపోతావ్ కొంచెం గట్టిగా పట్టుకు నిలబడు, ఇవాళో రేపో చచ్చిపోయే ముసిలాడివి ఆ చచ్చేదేదో ఇంట దగ్గిరే చావక ఎక్కడికి బయల్దేరావు?"—అని వృద్ధుని మందలింపు ధోరణిలో ప్రశ్నించి తను అందరి వేపూ నవ్వుతూ చూసాడు.

తప్పితే—కండక్టర్ తను కూర్చొన్న సీట్లోంచి కొంచెం కూడా జరుగలేదు.

ఇదంతా చూస్తున్న హిప్పీ అబ్బాయి చటుక్కున తన సీట్లోంచి లేచి నిలబడ్డాడు.

ఆ వృద్ధుని తన సీట్లో కూర్చోమని చెప్పి అలా కూర్చోటానికి సాయం కూడా చేసాడు.

సీట్లో కూర్చోగానే ఆ వృద్ధునికి పోయిన ప్రాణం తిరిగొచ్చింది. అతనా అబ్బాయి కేసి కృతజ్ఞతతో చూసాడు.

అందరితో పాటుగా తనూ రాడ్ పట్టుకొని నిలబడి ప్రయాణం చేయసాగాడు హిప్పీ అబ్బాయి.

ఎంత వద్దనుకొన్నా ఇది చూసి ప్రయాణీకుల మోహాలన్నీ ఆశ్చర్యాన్ని ప్రదర్శించాయి.

అందరికీ అదే నిజమైన సంస్కారంలా తోచింది.

హిప్పీ అబ్బాయి కేసి అందరూ చూస్తున్నారు.

ఈసారి వారి చూపుల్లో తేడా వుంది.

ఆ చూపుల్లో ఇందాకటివున్న ఈర్ష్య చోటునే ప్రశంస కన్పడింది.